
# శృంగార వీధి ప్రారంభం

## జానేదో...



నేను పతివ్రతను కాను!

అసలు పెళ్లంటూ అయితే కద! పతి - వ్రత అనే మాటల అవసరం!!

నాకూ పెళ్లయితే బాగుండునని ఉండేది! అయితే, ఎవరో ఒకరు, మగవాడైతే చాలు; ఏదో కాస్తపాటి సంపాదన ఉంటే చాలు; పెళ్లి చేసేసుకుందాం అని నా కెప్పుడూ లేదు.

మనిషి బాగుండాలి.

మంచి యౌవనంతో రూపసి కావాలి.

హుషారుగా ఉండాలి.

వసంతం, వెన్నెల కలబోసినట్టు ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండాలి.

అటువంటివాడే నిజమైన మగవాడు - నాకు నచ్చే మొగుడు; అంతే కానీ, తాళి కట్టినంత మాత్రాన మగవాడు ప్రతివాడూ మొగుడిగా చెప్పదగినవాడని నే ననుకోవడంలేదు. నే నిలా మాట్లాడే చాలామందికి చెడ్డదా న్నయ్యాను. నాకు పొగరనీ, కండకావరమనీ, నీతి లేదనీ, రకరకాల పేర్లు పెట్టారు. ఎవరో కాదు - మా బంధువులూ, స్నేహితులే! 'జానే దో' అనుకున్నాను.

వాళ్ల సంగతి కాదు నేను బాధపడేది.

నన్ను ప్రేమిస్తారనీ, ప్రేమించారనీ నమ్మిన అబ్బాయిలే నన్ను మోసం చేశారని నా బాధ. నేను మోసపోతే సంతోషించేవాళ్ల లేకితనం నాకు బాధ. అందుకే నేను మానసికంగా దెబ్బతిన్నా, పంటిబిగువున నా పొగరునీ, నా ఉద్దేశాలనీ కాపాడుకుంటూ వస్తున్నా!

అదేం ఖర్మమో కానీ, మనసుకీ, శరీరానికీ ఉండే మెత్తదనం వీళ్లకి అర్థం కాదు. అస లింతకీ ఒక ముఖ్య విషయం చెప్పాలని, ఈ కథ - నా కథ ప్రారంభించాను.

'మోసపోవడం' అంటే ... నన్ను దగ్గరకు తీసుకుని, నా తనువు పరిమళాన్ని, మృదుత్వాన్నీ తనివితీరా ఆవేశంతో ఆస్వాదించిన మగమనిషి అరగంట గడిచాక నన్ను ఎలా వదుల్చుకోవడమా! అని అలోచిస్తున్నాడని నాకు తెలియడం. ఈ గాయం మనస్సుది. పోనీలెండి, క్షణికమైనా ఆ సుఖం గొప్పదని సరిపెట్టుకుంటాను కానీ, రతి బాధితురాల నని ఎవడికి పడితే వాడికి భార్యని కాదలుచుకోలేదు.

ఇంతకీ, జరిగింది చెప్తాను. నాకు చల్లని సాయంకాలాలూ, వెచ్చని స్పర్శలూ అంటే చాలా ఇష్టం. రకరకాల పరిమళాలు ఇష్టం. మగపరిమళం మరీ ఇష్టం. ఆ పరిమళంలో బలం ఉంటే ఇంకా ఇష్టం.

నా కిప్పుడు వయస్సు ఇరవై రెండు. నా తొలి అనుభం సాగర్‌తో. అది రెండేళ్ల క్రితం సంగతి.

సాగర్ పుట్టినరోజునాడు వాళ్లింటికి వెళ్లాను. అందరం ఫ్రెండ్స్‌మి సరదాగా పాటలు, ఫొటోలు, జోకులతో రాత్రి పదకొండింటి వరకు గడిపాం.


అందరూ వెళ్లిపోయాక, సాగర్ నన్ను మా ఇంటికి తన స్కూటర్ మీద దింపుతానని చెప్పి, నాకు స్పెషల్ 'గిఫ్ట్' అంటూ ఓ పాష్ హోటల్‌కి తీసుకువెళ్లాడు. అప్పటికే ఒక రూమ్ అక్కడ బుక్ చేసినట్టున్నాడు. నేను థ్రిల్ అయిపోయాను.

రూమ్ చాలా చల్లగా ఉంది. మళ్లీ కబుర్లు, టీవీ ప్రోగ్రామ్‌లు. భోజనం వచ్చింది. అలా అలా కబుర్ల మధ్యనుంచే సాగర్ నా పెదవులపై ముద్దులతో, నా గుండెలపై వెచ్చదనంతో నాకు బద్ధకం, మత్తు కమ్మేలాగ చేశాడు. అప్పుడే నాకు తొలిసారిగా మగమనిషి శరీర పరిమళం తెలిసింది. ఆ పరిమళానికున్న వేడీ, వగరూ తెలిశాయి. రెండు మనస్సుల సంగతేమో కానీ, రెండు శరీరాలు ఒకటి కావడంతో అర్థం తెలిసింది.

ఎంత రాత్రయిందో ... సాగర్ నిద్ర లేపి, పద మనే వరకూ తెలియలేదు.

'మద్యం కంటే హృద్యం రతి సుఖ సారా!'

ఐ లవ్ యూ అంటే -
జీవన భాగస్వామ్యం
గుర్తొస్తుంది.
ఐ లైక్ యూ అంటే
పడకమీద
భాగస్వామ్యానికి
పరిమిత మవుతుంది.



అంటూండేవాడు సాగర్!

ఇంటి దగ్గర దింపి వెళ్లిపోతూ, 'ఐ లవ్ యూ' అంటా డనుకున్నా. అతను నా పెదవులపై ముద్దు పెట్టుకుని, "ఐ లైక్ యూ" అన్నాడు. మనస్సు చివుక్కుమంది. ఆ చివుక్కుమన్న ముల్లు ఇప్పటికీ బాధిస్తూనే ఉంది.

ఏమిటి తేడా ఆ రెండు మాటలకీ అంటారేమో!

ఐ లవ్ యూ అంటే - జీవన భాగస్వామ్యం గుర్తొస్తుంది.

ఐ లైక్ యూ అంటే పడకమీద భాగస్వామ్యానికి పరిమిత మవుతుంది.

సాగర్ అలా వచ్చినట్టే వచ్చి దూరమై అమెరికా వెళ్లిపోయాడు. నేనూ వివాహం ఎక్కా లనుకున్నాను. నా ఫ్లైట్ మిస్ అయిపోయింది.

ఆ తరవాత నాకు మగ, ఆడతనాల వ్యత్యాసం 'మగ దృష్టి' నుంచి ఏమిటో బాగా తెలిసిపోయింది.

మెడికల్ రిప్రజెంటేటివ్ సుబ్రహ్మణ్యం తొలి పరి చయంలోనే నన్ను ఆకలిగా కళ్లతోటే ఒళ్లంతా తడిమినప్పుడూ -

చార్లీ - 'జస్ట్ ఇట్సాల్ ఫన్' అని తేలిగ్గా కొట్టిపారేసినప్పుడూ -

హనుమంతరావు బోలెడు కబుర్లు చెప్పి, 'రతి సుఖ సారా'కి డబ్బు లెక్క కట్టినప్పుడూ -

ఇంకా ... సంప్రదాయపు పెళ్లిళ్ల గర్భాదానపు గదుల్లో పెళ్లి కయూతురు కొంగుకి బంగారం కట్టే ఆచారం గురించి విన్నప్పుడూ -

మగమనిషికీ, సెక్సుకీ, డబ్బుకీ లంకె అర్థమైపోయింది.

ఇంతా తెలిసిందా - అటువైపు చూడకుండా నేను బుద్ధిగా ఉండవచ్చునా?

ఊఁహుఁ ...

సుందరం బరోడా నుంచి మా అమ్మ వాళ్లని చూడడాని కొచ్చాడు. సుందరం అంటే మా రెండో అక్క మరిది.

మా అమ్మకి నన్ను అతనికిచ్చి పెళ్లి చెయ్యాలని కోరిక కాబోలును! అతనున్న నాలుగు రోజుల్లో నన్ను అతన్ని కలిపి ఉంచే ప్రయత్నాలు చేసింది. అతను బరోడాలో ఏదో కాలేజీలో లెక్చరర్. మంచి మాటకారి. అమ్మ కల్పించిన ఏకాంతం పుణ్యమా అని రెండు రోజుల్లో చాలా దగ్గర అయ్యాం. బహుశా మానసికంగా అనుకుంటాను.

ఓ రోజు - ఆ రాత్రికి అతను తిరిగి వెళ్లిపోవాలి ... వంటింట్లో నేను కుక్కర్ దించుతుంటే, వెనుక నుంచి వచ్చి కౌగిలించుకుని, నా చెవిమీద ముద్దు పెట్టుకున్నాడు. చెవి 'గుయ్'మంది. కితకితలు. కుక్కర్ కింద పారేశాను. పెద్ద సీను, నవ్వులు!

అప్పటికి 'రతిసుఖసారా'కి నేను దూరమై చాలా కాలమైంది.

ఇన్నాళ్లకి మళ్లీ స్పర్శ. మళ్లీ ఉద్వేగం! ఈ ముద్దులు, కౌగిలింత లనేవి ఉన్నాయే, ఇవి అణుబాంబులు కన్నా ప్రమాదమైనవి.

అతను - సుందరం నన్ను గట్టిగా కౌగిలించుకున్నాడు. గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. గట్టిగా ప్రేమిస్తున్నా నన్నాడు.

నేను మెత్తబడిపోయాను!

ఏం లేదు - "ప్రేమిస్తున్నా" నని నాతో అన్న మొదటి మగమనిషి సుందరం!

ఇది జీవన భాగస్వామ్యానికి నాంది అనుకోవచ్చునా నేను?

ఏమో! మరో అరగంట పోయాక మాట మారకపోతే!

పడగ్గదిలో దీపం ఆరకపోతే! అంతే కద!

**జానేదో!**